
సాక్షి
చిత్తూరు
ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఘనంగా రెజ్లింగ్ పోటీలు

యాదమరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో రెజ్లింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి - 8లో



విద్యుత్ భారం ప్రభుత్వానిదే

పెంచిన విద్యుత్ ఛార్జీల భారం ప్రభుత్వమే భరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. - 8లో



ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి

వైద్యశాఖ ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని తెలుగునాడు యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: కాణిపాకంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయంలో కిక్కిరిశారు. క్యూలు భక్తజనంతో నిండుగా కనిపించాయి. ఉచి త, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాల లైన్లు కిటకిటలాడాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు.

నవోదయ అడ్మిషన్లకు 19 వరకు గడువు

చిత్తూరు కలెక్టరేట్ : 2025–26 విద్యాసంవత్సరానికిగాను జవహర్ నవోదయ అడ్మిషన్లు పొందడానికి ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందని ఆ కళాశాల ప్రిన్సిపల్ వేలాయుధన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లి జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11వ తరగతిలో 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అర్హులు, ఆసక్తి ఉన్న విద్యార్థులు 2025వ సంవత్సరం జనవరి 8వ తేదీన నిర్వహించే టరల్ ఎంట్రీ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో అడ్మిషన్లకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఎనిమిదో తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ ఉండాలన్నారు. 2010 మే నెల ఒకటి నుంచి 2012 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. 11వ తరగతిలో అడ్మిషన్లకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుతూ 2008 జూన్ ఒకటి నుంచి 2010 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండాలని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులు ఉచితంగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, కేటగిరీ, జనరల్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, గ్రామీణ, పట్టణం, వైకల్యం, పరీక్ష మాధ్యమం విషయాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాల్లో మార్పులు చేసేందుకు ఈ నెల 20, 21 తేదీల్లో అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం లక్ష్మీనారాయణ 8919956395, జగదీశ్ కుమార్ 7013201138 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

చిత్తూరు కలెక్టరేట్ : నిరుద్యోగ జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, క్యూరా పర్సనల్ ఆధ్వర్యంలో జర్మన్ భాషలో శిక్షణ, జర్మనీలో ఉద్యోగ కల్పన కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివిన యువత అర్హులన్నారు. 6 నెలల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందని చెప్పారు. శిక్షణ గుంటూరు జిల్లాలో ఉంటుందని తెలిపారు. జర్మన్ భాషలో ఏ–1, ఏ–2, బీ–1, బీ–2 స్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు skillinternational@apssdc. in మెయిల్ చేయాలన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శిక్షణా తరగతులు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాలో పలువురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం ఎంపిక జాబితా విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం.. చిత్తూరు జిల్లాలోని గంగవరం మండలం జెడ్పీ హైస్కూల్ మేలుమాయి గ్రేడ్ హెచ్‌ఎం శ్రీధర్ బాబు, ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో బయాలజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ సురేంద్రబాబు ఎంపికయ్యారు. అలాగే తిరుపతి జిల్లాలోని తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఎంపీపీఎస్ ఎస్జీటీ బాలసుబ్రహ్మణ్యం, ఏర్పేడు మండలం బండారుపల్లె జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం రాజనగరం జెడ్పీ హైస్కూల్ బయాలజికల్ స్కూల్ అసిస్టెంట్ కామాక్షయ్య, ఏర్పేడు మండలం పల్లం జెడ్పీ హైస్కూల్ గ్రేడ్ 2 హెచ్‌ఎం ఆనంద్, ఏ.రంగంపేట జెడ్పీ హైస్కూల్ ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రభాకర్‌రావును రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. రెండు జిల్లాల్లో ఎంపికైన టీచర్లు ఈ నెల 11వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని లబ్బీపేట ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొనాలని విద్యాశాఖాధికారులు విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఎంపికైన టీచర్లు రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా అవార్డులను స్వీకరించనున్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో తెలుగు దేశం పార్టీ మిత్ర ధర్మాన్ని విస్మరించింది. మొదటి జాబితాలో మొండిచేయి చూపిన ఆ పార్టీ రెండో జాబితాలోనూ జనసేన, బీజేపీ నేతలకు చెక్ పెడుతూ మిత్ర ద్రోహానికి తెరలేపింది. పదవులు వస్తాయన్న ఆశతో ఎదురు చూసిన సొంత పార్టీ నేతలకు సైతం నిరాశే మిగిలింది. తమ పార్టీలో ఉన్నవాళ్లే వెన్నుపోటు పొడిచి.. కానివారిని అందలం ఎక్కించారని పలువురు విమర్శిస్తున్నారు.



మిత్ర ద్రోహం!

- నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేన, బీజేపీకి మొండిచేయి
- రెండో విడతలోనూ తమ్ముళ్లకే అగ్ర తాంబూలం
- అందులోనూ జెండా మోసిన వారికి పంగనామాలు
- పోస్టుల భర్తీపై అంతర్మథనంలో టీడీపీ నేతలు
- సముచిత స్థానం ఇవ్వలేదని మిత్రపక్షాల ఆవేదన
- తుడా చైర్మన్ గిరిపై వీడని ఉత్కంఠ.. ఎవరికి వారు లాబీయింగ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి/చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పలు నామినేటెడ్ పోస్టులను కూటమి ప్రభుత్వం శనివారం భర్తీ చేస్తూ జాబితా విడుదల చేసింది. ఇందులో తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ఐదుగురుకి చోటు దక్కింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్‌పర్సన్‌గా చిత్తూరుకు చెందిన మాజీ మేయర్ కటారి హేమలత, ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన నరసింహయాదవ్, ఏపీ వన్నియకుల క్షత్రియ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న సీఆర్. రాజన్‌ను, ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా తిరుపతికి చెందిన ఆర్.సదాశివ, ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా నీలాయపాళెం విజయకుమార్‌ను నియమించారు. ఈ ప్రకటన అటు మిత్రపక్షాల్లో, ఇటు సొంత పార్టీలో అగ్గి రాజేసిందనే చెప్పాలి.



సంబరాలు చేసుకుంటున్న కటారి హేమలత

మిత్రపక్షాలకు చోటేదీ?

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అనేక మంది నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. రెండు నెలల క్రితం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బీజేపీ, జనసేన పార్టీ నాయకుల్లో ఏ ఒక్కరికీ చోటు లభించలేదు. తాజాగా విడుదల చేసిన జాబితాలోనూ రెండు జిల్లాలకు చెందిన బీజేపీ, జనసేన నేతలకు ఒక్కటంటే ఒక్క పదవి కూడా దక్కలేదు. ఇది చంద్రబాబు నాయుడు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారా? లేదా? జిల్లాలో కీలకంగా ఉన్న జనసేన, బీజేపీ నాయకులు అడ్డుపడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదవులు పొందిన ఒకరిద్దరిపైనే ఆ పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండో జాబితాలో చోటు దక్కని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ, కిరణ్‌రాయల్, కోలా ఆనంద్, డాక్టర్ హరిప్రసాద్, దివాకర్‌రెడ్డి పలువురు మూడో జాబితాపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. అందులో ముఖ్యంగా తిరుపతి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (తుడా) చైర్మన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. తుడా చైర్మన్ గిరి కోసం ఎవరికి వారు అమరావతిలో లాబీయింగ్ నెరుపుతున్నారు.

యాదవ్‌ని కులానికే పరిమితం చేసిన బాబు

తిరుపతి జిల్లాలో టీడీపీ అంటే నరసింహయాదవ్ పేరు గుర్తొస్తుంది. ఎన్టీఆర్ హయాం నుంచి ఆయన టీడీపీని అంటిపెట్టుకుని ఉన్నారు. పసుపు చొక్కానే ధరించి 24 గంటలు పార్టీ కోసమే పనిచేసే వ్యక్తి ఆయన. ఇతనికి కీలక పదవి దక్కుతుందని అంతా ఆశించారు. చివరకు నరసింహయాదవ్‌కి ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి కేవలం కులానికే పరిమితం చేయడంపై ఆ సామాజికవర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతను టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో ఆమె కినుక వహించారు. దీంతో తాజాగా ఆమెను చుడా చైర్మన్‌గా నియమించారు. ఇప్పటి వరకు ప్రకటించిన రెండు జాబితాల్లో శాప్ చైర్మన్, ఆర్టీసీ చైర్మన్ పదవులు చెప్పుకోదగ్గవి. ఇందులో శాప్‌చైర్మన్ పదవిని రవినాయుడికి కట్టబెట్టడంపై తిరుపతి జిల్లా టీడీపీ శ్రేణులు లోలోన రగిలిపోతున్నారు. జిల్లాలో కీలకంగా వ్యవహరించే వారు, ఓటు బ్యాంక్ ఉన్న వారికి ఇవ్వకుండా.. చంద్రబాబు సొంత నియోజక వర్గానికి చెందిన రవినాయుడికి ఇవ్వడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే టీడీపీలో కీలకంగా వ్యవహరించే వారిని కాకుండా పైరవీలు చేసే వారికి పదవులు కట్టబెట్టడంపై ఆ పార్టీ నేతలు భగ్గుమంటున్నారు.

గ్రూపులు తప్పవా?

రెండో జాబితాలో కటారి హేమలతకు చుడా చైర్‌పర్సన్ పదవి దక్కింది. చుడా కుర్చీ కోసం చిత్తూరుకు చెందిన చెరుకూరి వసంతకుమార్ నాయుడు చేసిన తీవ్ర ప్రయత్నాలు బెడిసి కొట్టాయనే చెప్పాలి. ఇతనికి చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడుతో పాటు రెండు జిల్లాల నుంచి ఏడుగురు అధికారపార్టీ ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. అయితే ఇదే సామాజికవర్గానికి చెందిన ఎన్‌పీఎస్ జయప్రకాష్ నాయుడు కూడా చుడా కోసం ప్రయత్నించడంతో చిత్తూరుకు చెందిన పార్టీ సీనియర్ నేత దొరబాబు నాయుడు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. కమ్మ సామాజికవర్గానికి చెందిన ఇద్దరు నేతలకు ఈ పోస్టు ఇవ్వడం కన్నా, బలిజ సామాజికవర్గానికి చెందిన హేమలతకు ఇవ్వడం ఉత్తమమని పార్టీ హైకమాండ్‌కు చెప్పడంతో వసంత్‌కుమార్ నాయుడకు చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పోస్టును తనకు రిజర్వు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. చుడా పోస్టును తిరుపతి ఎమ్మెల్యే అన్న కొడుకు ఆరణి శ్రీనివాసులు ఆశించినా, అది అడియాశలుగానే మిగిలిపోయింది. తాజా ప్రకటనతో టీడీపీ గ్రూపు రాజకీయాలు తప్పవనే సంకేతాలు విశ్లేషకుల నుంచి వెలువడుతున్నాయి.

భయం.. భయం..!

- ప్రశ్నించే గొంతుకపై క్రిమినల్ కేసులు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు ఖాకీల బెదిరింపులు
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికి జంకుతున్న నెటిజన్లు
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజా సంఘాల ఆగ్రహం

“ భాను.. చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలంటూ సామాజిక మాధ్యమం వేదికగా ప్రశ్నించాడంతే. స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు.. మరోమారు ఏదైనా పోస్టు పెడితే కటకటాల్లోకి తోస్తామంటూ బెదిరింపులకు దిగారు.

చిత్తూరు చెందిన అశోక్‌కుమార్ అనే పీజీ చదువుతున్న విద్యార్థి. మహిళలకు ఇచ్చిన వాగ్దానం, ఉచిత బస్సును ఎప్పుడు ప్రారంభిస్తారని..? ఇసుకను ఉచితమని చెప్పి ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని..? ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్‌లో పెట్టాడు. అంతే తీవ్రవాదిని పిలిచినట్టు స్టేషన్‌కు పిలిపించి ‘నీకెందుకురా రాజకీయం. క్రిమినల్ కేసు పెడితే నీ ఫ్యూచర్ మొత్తం పోతుంది. జాగ్రత్త’ అంటూ ఓ పోలీసు వార్నింగ్ ఇచ్చాడు.

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వ తప్పిదాలను, నేతలు చేస్తున్న అవినీతి అక్రమాలను నిలదీస్తుంటే అధికార పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రశ్నించే గొంతు నులిమివేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే సోషల్ మీడియా యాక్టివిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టి, అరెస్టులు చేసి ఆనందపడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలువురిపై వైఎస్సార్ సీపీ సానుభూతి పరులుగా ముద్రవేసి.. స్టేషన్‌కు పిలిచివార్నింగ్‌లు ఇస్తున్నారు.

భావ ప్రకటనపై దాడి కాదా..?

ప్రశ్నించే గొంతును తప్పుడు కేసులతో నొక్కేయాలని చూడడం ముమ్మాటికీ రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేయడమే అవుతుంది. అధికారంలోకి రావడానికి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో పాటు.. గెలిచిన కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు నియోజకవర్గానికో మానిఫెస్టో ఇచ్చారు. ఇప్పటివరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. వీటిని ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సప్‌లో చాలామంది ప్రజా స్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం, పోలీసులు తీసుకుంటున్న చర్యలను చూసి అసలు సోషల్ మీడి యాలో ఏదైనా పోస్టులు పెట్టాలంటేనే నెటిజన్లు భయపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వీడియోలు షేర్ చేసినా, లైకులు కొట్టినా కూడా ఖాకీలు వదలడంలేదు. జుగుప్సాకరమైన పోస్టులు, బూతులు తిట్టడం లాంటివి ఏదైనా పెడితే, చర్యలు ఉండాలే తప్ప.. అందర్నీ ఒకేలా చూడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అందరినీ ఇలా అదుపులో పెట్టి, సామాన్యుడి నోరు నొక్కేయాలనుకోవడం అవివేకమే అవుతుంది తప్ప.. వివేకం కాదు.

భావ ప్రకటన స్వేచ్ఛ లేదా?



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశత్వ పాలన సాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చేసే తప్పులు, మోసాలను ఎత్తి చూపిస్తే అక్రమ కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదు. సోషియల్ మీడియాలో పెడితే కేసులు, అక్రమ అరెస్టులు చేస్తారు కానీ.. బాలికలు, మహిళలపై లైంగికదాడి చేసిన వారిని మాత్రం అరెస్టు చేయారని, ఇది ఎక్కడి న్యాయం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత, మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్రంలో జరిగే అరాచకం, అన్యాయం, దోపిడీ, లైంగికదాడులు, శాంతి భద్రతల విఘాతం తదితర దారుణాలు మీకు కనపడలేదు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు భావ ప్రకటన లేదు.

– కృపాలక్ష్మి, వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి

కూటమి సోషల్ యాక్టివిస్టులపై చర్యలేవీ?



చిత్తూరు కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులపై సోషల్ మీడియా కేంద్రంగా కూట మి నాయకులు అసహ్యంగా పోస్టులు పెడుతున్నారని పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి అధికార పార్టీ నేతలపై కేసులు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. శనివారం చిత్తూరులో డీఎస్పీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసి మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలోని పలు ప్లాట్‌ఫామ్‌ల్లో తమ పార్టీ నేతలపై వ్యక్తిత్వహననానికి పాల్పడుతున్నారన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యు లు, మాజీ మంత్రులపై మాటల్లో చెప్పలేని పోస్టులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు.

ఇది మంచి పద్ధతి కాదు..



రాష్ట్రంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వం, పోలీసులు తీసుకుంటున్న చర్యలు పద్ధతిగా లేవు. కేవలం కక్షసాధింపు చర్యలా ఉంది. ఓ విషయం నచ్చకపోతే దాన్ని ధైర్యంగా చెప్పడం, నిరసన తెలియజేసేహక్కు రాజ్యాంగం కల్పించింది. తప్పుడు పనులు చేస్తే చట్టరీత్యా వెళ్లండి. అంతేగానీ ప్రశ్నించే వాళ్లందరిపై కేసులు పెడతామంటే ఎలా..? ఎవరి కోసం ఇదంతా..? రేపు రోడ్లపైకి వచ్చి కూడా నిరసన చేయకూడదనే జీఓ ఏమైనా తీసుకొస్తారా?

– ఎస్.నాగరాజన్, సీపీఐ నేత, చిత్తూరు

ఎంత మందిపై కేసులు పెడతారు..?



ప్రశ్నించడం భావ వ్యక్తీకరణను తెలియచేయడమే. ఇది రాజ్యాంగబద్ధం. ఒకవేళ చట్టవిరుద్ధంగా ఏదైనా ఉంటే చర్యలు తీసుకోండి. అంతేగానీ అసలు మేమేం చేసినా ప్రశ్నించకూడదంటే ఎలా..? ఎంత మంది నోళ్లు మూయిస్తారు..? ఎంత మందిపై కేసులు పెడతారు..? ప్రజాస్వామ్యంలో ఇలాంటివి తగవు.

– సురేంద్ర, సీపీఎం నాయకులు, చిత్తూరు

సలహాలుగా స్వీకరించండి..



ప్రభుత్వ తప్పుప్పాలు ప్రశ్నించడం మంచిదే కదా. ఇది వ్యక్తిత్వ హననం ఎలా అవుతుంది..? ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రశ్నిస్తారు. ప్రభుత్వంలో లోటుపాట్లు ఉంటే ప్రశ్నిస్తారు. వీటిని సలహాలుగా తీసుకుని తప్పులు ఉంటే సరిదిద్దుకోండి. అంతేగానీ.. కేసులు పెడతామంటే ఎలా..?

– మొహిద్దీన్ అలీ, జేడీఎస్ నాయకులు, చిత్తూరు.

యంత్రాలతో ఉపాధి పనులు!



కుమ్మరనత్తంలో జేసీబీతో చేస్తున్న ఉపాధి పనులు

పుంగనూరు : పేద కూలీల కోసం ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పథకం టీడీపీ నేతలకు వరంగా మారింది. కూలీలతో చేయించాల్సిన ఉపాధి పనులు పుంగనూరు మండలంలో బాహాటంగా జేసీబీతో చేయిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని కుమ్మరనత్తం పంచాయతీలోని కపాడంమిట్టపల్లి చెరువులో ఫాంపాండ్‌లు నిర్మించేలా అనుమతి మంజూరు చేశారు. ఈ పనులను కూలీలతో చేసి ప్రతి వారం డబ్బు చెల్లించాలి. కానీ సుమారు రూ.2 లక్షలు విలువ చేసే ఈ పనిని స్థానిక టీడీపీ నేత స్థానిక అధికారులతో కలసి జేసీబీతో చేయిస్తుండగా ఆ ప్రాంత వాసులు అడ్డుకున్నారు. గత్యంతరం లేక పనులను అర్ధంతరంగా ఆపేసి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంపీడీఓ లీలామాధవిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ఏపీఓ శివశంకర్ మాట్లాడుతూ ఉపాధి పనిని జేసీబీతో చేసింది వాస్తవమేనని, బిల్లులు చెల్లించకుండా నిలిపివేస్తామన్నారు.

దొంగనోట్లు మారుస్తూ పట్టుబడిన తండ్రీ కూతురు

– విచారిస్తున్న పోలీసులు

పుత్తూరు: పట్టణంలో శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో రూ.500 దొంగ నోట్లను మారుస్తున్న తండ్రీ కూతురు పట్టుబడ్డారు. పుత్తూరులోని తిరుపతి రోడ్డు, మండీ స్ట్రీట్‌లోని ప్రొవిజన్ షాపుల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకున్నారు. తర్వాత మళ్లీ ప్రతి షాపు వద్ద రెండేసి రూ.500 నోట్లు ఇచ్చి చిల్లర కావాలంటూ అడుగుతుండడంతో షాపు యజమానులకు అనుమానం కలిగింది. వెంటనే వారిచ్చిన నోట్లను మిషన్ ద్వారా చెక్ చేయడంతో అవి దొంగనోట్లు అని తేలింది. వెంటనే షాపు యజమానులు వారిని పూల మార్కెట్ వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా వీరు తిరుచానూరుకు చెందిన వారుగా తెలిసింది.

అతివలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

– జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మజ



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మజ

చిత్తూరు కలెక్టరేట్ : మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మిట్టూరు లోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు న్యాయ సేవాదినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అవగాహన పెంచుకోవడంతో భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చదువుకునే స్థాయి నుంచే చట్టాలపై పూర్తి పట్టు సాధించాలని తెలిపారు. మహిళలు మానసిక స్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. మహిళలపై పలు చోట్ల జరుగుతున్న హత్యలు, లైంగికదాడులు తదితర వాటిని ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలన్నారు. తనకు తాను శక్తిగా రూపొందాలని సూచించారు. మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముఖ్య ఆశయమన్నారు. తమ సంస్థ తరఫున పేద బాధితులు, మహిళలు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామన్నారు. కోర్టులో కేసు వాదించేందుకు ఉచితంగా న్యాయవాదిని సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుసూదన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎఫ్‌ఆర్‌ఎస్‌ని రద్దు చేయాలి

బంగారుపాళెం: వైద్యశాఖలో పనిచేస్తున్న వైద్య, ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు(ఎఫ్‌ఆర్‌ఎస్)విధానాన్ని రద్దు చేయాలని తెలుగునాడు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తగ్గువారిపల్లె పాత పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలంటూ నాయకులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు శరత్‌కుమార్, మణి మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు విధానంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే జనాభా ఆధారంగా ఉద్యోగులను కుదించేందు తీసుకు వచ్చిన జీఓ నంబర్ 143ను రద్దు చేయాలన్నారు. సీఎం చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, భువనేశ్వరి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సహాయకుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఉద్యాన సహాయకుల సంఘం ప్రతినిధులు

రొంపిచెర్ల: మండల కేంద్రంలో శనివారం జరిగి న జిల్లా ఉద్యాన సహాయకుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. చిత్తూరు జిల్లా ఉద్యాన సహాయకుల సంఘం అధ్యక్షుడిగా పి.నరసింహులు (రొంపిచెర్ల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దుర్గాప్రసాద్, సాయి ప్రియతమా, ప్రధాన కార్యదర్శిగా మనోజ్, అదనపు కార్యదర్శిగా మల్లీశ్వరి, సహాయ కార్యదర్శిగా భరత్‌కుమార్, కోశాధికారిగా సాయిలక్ష్మి, సహ కోశాధికారిగా అహంతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా లోకేష్, ప్రచార కార్యదర్శిగా సతీష్, మహిళ వెల్ఫేర్ కార్యదర్శులుగా అరుణ, సంధ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చంద్రయ్య, షాలిని, జిల్లా ఈసీ మెంబర్లుగా సాయి మనోజ్, లహరిప్రియ, శ్రావణి, కుసుమ, వినయ్, సుప్రియ, పూజిత, యాస్మిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ఉద్యాన సహాయకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

మద్యం కేసులో ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ

బంగారుపాళెం: మండలంలోని రాగిమాను పెంట గ్రామంలో శనివారం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో తాము సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య వద్ద 33 క్వార్టర్ బాటిళ్ల అక్రమ మద్యం ఉండగా గుర్తించి, స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయించినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

ఘనంగా స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలు

- పోటీల్లో పాల్గొన్న 13 జిల్లాల క్రీడాకారులు



పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు

యాదమరి(పూతలపట్టు): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర 68వ రెజ్లింగ్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యాదమరి ఉన్నత పాఠశాలలో ఈ పోటీలను అధికారుల నిర్వహిస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన ప్రారంభమైన పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. బాలురు 130, బాలికలు 130 మంది మొత్తం 260 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఆటల్లో పాల్గొనే క్రీడాకారులకు శిక్షణను అందజేశారు. సాయంత్రం అధికారులు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదట బాలికలకు 30 రౌండ్లు నిర్వహించగా మొదటి స్థానంలో చిత్తూరు, రెండో స్థానంలో విశాఖపట్నం జిల్లా క్రీడాకారుల నిలిచారు. గెలుపొందిన వారికి ఆదివారం రెండు రౌండ్లు నిర్వహిస్తారు. బాలురుకు మొదటి రౌండ్ నిర్వహిస్తారు.

260 మందికి మౌలిక సదుపాయాలు

68వ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రావడంతో క్రీడాకారులకు అధికారులు మౌలిక సదుపాయాలను కల్పించారు. బాలురుకు హైస్కూల్‌లోనే వసతులను కల్పించగా, బాలికలకు పాఠశాల సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో వసతి ఏర్పాటు చేశారు. పోటీలు జరగనున్న మూడు రోజుల పాటు క్రీడాకారులకు నాణ్యమైన భోజన వసతులను కల్పించడం కోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ పోటీలు ఆదివారం సెమీఫైనల్ పోటీలు నిర్వహించి, సోమవారం ఫైనల్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంతవాణి, ఎంపీడీఓ వేలు, తహసీల్దార్ పార్థసారథి, ఎంఈఓ రుక్మిణి, హెచ్‌ఎం గిరిరాజా, కార్యనిర్వాహక రవి, హరి, పీడీలు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు



పోటీ పడుతున్న బాలురు

శరవణ మృతదేహానికి పంచనామా



పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) శరవణ(ఫైల్)

గుడుపల్లె: విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన శరవణ మృతదేహానికి శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వైద్యులు పోస్టు మార్టం చేశారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కుప్పం సీఐ మల్లేష్ యాదవ్, ఎస్‌ఐ శ్రీనివాసులు బాధితులను అదుపులో తీసుకుని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం పొలాల్లో కరెంట్ తీగలు లాగి, శరవణ మృతికి కారణమైన రామకృష్ణపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

తుమ్మలగుంటలో సప్తవర్ణశోభితం



కల్యాణ వెంకన్నకు పుష్పార్చన

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6.30 గంటల వరకు ఆలయంలో ప్రత్యేకంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పయాగానికి ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఆ తర్వాత సాయంత్రం 3 గంటల నుంచి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. 12 రకాల పుష్పాలు, 6 రకాల పరిమళ భరిత పత్రాలు (ఆకులు)తో స్వామి వారికి నివేదన చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించే పుష్పయాగం తరహాలనే వైఖానస ఆగమోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం , మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను పుష్పయాగంలో ఉపయోగించారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే పుష్పయాగానికి సుమారు 3 టన్నుల పుష్పాలను వినియోగించారు.

భక్తులకు ప్రసాదంగా అందజేత

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు పుష్పయాగంలో నివేదించిన పుష్పాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అరుదైన పుష్పాలు చేతికి రావడంతో భక్తులు ఆనందంగా స్వీకరించి భక్తితో తమ వెంట తీసుకుని వెళ్లారు. పుష్పయాగ మహోత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తుల భారీ ఏర్పాట్లు చేపట్టారు.

ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా మొహమ్మద్ అలీ



చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా మొహమ్మద్ అలీ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఉర్దూ అకాడమి నిర్వాహకులు ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లాలోని వి.కోట ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మొహమ్మద్ అలీని ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధి, చదువు మానేసిన విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడం తదితర కార్యక్రమాలు చేపట్టినందుకు గాను ఆయనకు అవార్డు లభించింది. ఎంపికైన ఆయన ఈ నెల 11వ తేదీ రాష్ట్ర స్థాయి మైనారిటీ దినోత్సవం కార్యక్రమంలో సీఎం చేతులు మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఎంపికైన ఆయన్ని డీఈఓ వరలక్ష్మి, డీవైఈఓ చంద్రశేఖర్, ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్ ఖాన్, తోటి ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

శ్రీదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కు ఉత్తమ విద్యాబోధన, హిందీ సబ్జెక్టులో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చేసిన కృషికి గాను ఆమెకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఆమె ఈ నెల 11వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును స్వీకరించనున్నారు.

విద్యుత్ భారం ప్రభుత్వమే భరించాలి

చిత్తూరు కార్పొరేషన్: పెంచిన విద్యుత్ చార్జీల భారం ప్రభుత్వమే భరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట రూ.6,072 కోట్లు వినియోగదారులపై భారం మోపారన్నారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ప్రజలకు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించారని, ఇప్పుడేమో అధికారంలోకి వచ్చిన 5 నెలలకే రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.వేల కోట్లు ప్రజలపై వడ్డించడం సరికాదన్నారు. ఇది చాలక విద్యుత్‌చార్జీలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదన్నారు. ఇచ్చిన హామీల నెరవేర్చక పోగా అధికారంలో రాగానే చార్జీలు పెంచడం, భూ ధరలు పెంచాలని చూడడం అన్యాయమన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు లబ్ధి చేకూర్చి, అభివృద్ధిని చేసి చూపించాలన్నారు. అధికారం కోసం అనువుగానీ హామీలిచ్చి, గద్దెనెక్కినాక వాటిని విస్మరించడం సమంజసంకాదన్నారు. ఇలాగే ఉంటే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ప్రతి నెలా విద్యుత్ వినియోగదారులపై భారం పడుతుందని, ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి విద్యుత్ వినియోగదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు కేశవులరెడ్డి, చైతన్య, సురేంద్రనాథ్, ద్వారకనాథ్, శ్రీనివాసమూర్తి, చక్రవర్తిరెడ్డి, నౌషాద్, రసీద్, అజమాతుల్లా, మునస్వామి, రాబర్ట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా న్యాయవాది చక్రవర్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చైతన్య, ఉపాధ్యక్షులుగా సురేంద్రనాథ్, శ్రీనివసమూర్తి, ద్వారకనాథ్, అజమాతుల్లా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా మునస్వామి, రషీద్, భాస్కర్ రెడ్డి, రాబర్ట్ ఎన్నికయ్యారు.

అక్రమ కేసులతో అణచివేత



పుంగనూరులో తెలుగుదేశం గుండాలు ధ్వంసం చేసిన ఎంపీ వాహనాలు (పాత)

- అమాయకులైన ముస్లింలే టార్గెట్
- పుంగనూరు ఘటనలో ఇప్పటికే 40 మందిపై కేసు



అరెస్ట్ అయిన ఖాదర్‌బాషా

పుంగనూరు: రాష్ట్రంలో వివిధ వర్గాలపై రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కొంత మంది టీడీపీ నేతలు హింసకు పాల్పడుతున్నారు. పుంగనూరులో అత్యధిక జనాభా కలిగిన ముస్లింలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరికి సముచిత ప్రాధాన్యం దక్కింది. పెద్దిరెడ్డి కుటుంబ వరుస విజయాల్లో ముస్లింల పాత్ర కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలను తమవైపునకు తిప్పుకునేందుకు టీడీపీ కుట్రలకు తెరతీసినట్లు తెలుస్తోంది.

ఇటీవల జరిగిన పుంగనూరు ఘటనలను టీడీపీ తమకు అనుకూలంగా మార్చుకుని ముస్లింలను టార్గెట్ చేసింది. ఇదే అదునుగా భావించి అక్రమ కేసులతో వేధింపులకు సిద్ధమైంది. ఏకంగా 40 మంది ముస్లింలపై కేసులు పెట్టించారు. ఇందులో 11 మంది ముస్లింలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఒకే వర్గంపై ఇంత సంఖ్యలో కేసులు నమోదు కావడం తీవ్ర చర్చనీయాంశం అయింది. దీనిపై ముస్లింలు వివిధ కోర్టుల్లో 20 మంది ముందస్తు బెయిల్ పొందారు.

తప్పుడు కేసులు నమోదు..

టీడీపీ నేతలు ఇచ్చిన రెండు తప్పుడు ఫిర్యాదులపై ఎంపీ మిథున్‌రెడ్డిని రెండు కేసుల్లో ప్రధాన నిందితుడిగా చూపి, మాజీ ఎంపీ రెడ్డెప్పను రెండు కేసుల్లోను రెండో నిందితుడుగా పేర్కొంటూ 72 మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అలాగే ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటనకు సంబంధం లేని ముస్లిం నాయకులనూ పోలీసులు వదిలిపెట్టకుండా కేసులు పెట్టారు. శనివారం రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్, పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రధాన అనుచరుడుగా ఉన్న ఖాదర్‌బాషాను ఎఫ్‌ఐఆర్‌లో కొత్తగా నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు టైలర్‌గా పనిచేస్తున్న అస్లాంభాషాను, నర్సింగా అనే వ్యక్తిపై కేసులు నమోదు చేసి, ముగ్గురిని రిమాండ్‌కు తరలించడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక సమస్యతోనే ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం

తిరుపతి అర్బన్: ఇసుక సమస్య వల్లే పక్కాగృహాల నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. ఇసుక రవాణా చార్జీలు హౌసింగ్ అధికారులే పెట్టుకోవాలని సూచించారు. త్వరలో ఉపాధి పథకంతోపాటు జేజేఎం, అమృత పథాకాల నిధులతో హౌసింగ్ కాలనీలు అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పంలోని హౌసింగ్ కాలనీల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.

నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేశారు

హౌసింగ్ కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేశారని మంత్రి ఆరోపించారు. వాటిపై విచారణ చేపట్టాలని జేసీని ఆదేశించారు. అంతేకాకుండా కొందరు బినామీ పేర్లతో ఇంటిపట్టాలు పొందారని, మరికొందరు ఇంటి పట్టాలు తీసుకుని విక్రయించారని వాటిపై కూడా విచారణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కురుగొండ రామకృష్ణ, పులివర్తి నాని, విజయశ్రీ, మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిధుల కొరత లేదు

హౌసింగ్ మంత్రి మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపుల్లో నిధుల కొరత లేదని చెప్పారు. అయితే అధికారులు బిల్లులు ఇవ్వడంతో జాప్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని హౌసింగ్ కాలనీల్లో లక్ష ఇండ్లు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నుంచి రెండో దశగా కేంద్ర ప్రభుత్వం నిధులతో హౌసింగ్ స్కీమ్ మొదలు పెడుతామని తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ అధికారులు జీవీ ప్రసాద్, నాగభూషణం పాల్గొన్నారు.